# పతకాల పంట వరంగల్ పోలీస్ వెంట

## రాష్ట్ర పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన వరంగల్ కమిషనరేట్

**హన్మకొండ మహా:** సైబరాబాద్ వేదికగా నాల్గగవ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు వివిధ క్రీడల్లో అద్భుతమైన ఆట తీరు ప్రదర్శించి తమ సత్తాను చాటారు. ఆరురోజుల పాటు జరిగిన ఈ క్రీడలు శనివారం రాత్రి ముగిసాయి. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు మొత్తం 86 పతకాలను సాధించి పతకాల పట్టికలో మూడవ స్థానంలో నిలిచారు. సాధించిన పతకాల్లో 12 స్వర్ణాలు, 25 రజితాలు,49 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు ప్రధానంగా అర్చరీ క్రీడలో అత్యధికంగా ఐదు బంగారు పతకాల తో సహా మొత్తం 13 పతకాలను సాధించి అర్చరీ క్రీడలో తిరుగులేని ప్రదర్శన కనబరిచారు. ఇతర క్రీడల విషయంలో ఇదే రీతిలో వరంగల్ పోలీస్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేసారు. జూడో క్రీడలో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు నాలుగు రజితా పతకాలను సాధించి జూడో చాంఫియన్ షిప్ రన్నరప్‌గా ముఖ్య అతిధుల చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. ఇదే రీతిలో బాక్సింగ్, ఆర్మ్స్ రెజ్లింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బ్యాట్మెంటెన్, టగ్ ఆఫ్ వార్‌లో,సైకిలింగ్, స్మిమ్మింగ్,హాకీ విభాగాల్లో గతంలో కన్నా మెరుగైన ఆట తీరు చూపించారు. ప్రధానంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సైతం కాంస్య పతకాన్ని సాధించడం విశేషం. అలాగే పోలీస్ చరిత్రలో



ఎన్నడూ పుట్‌బాల్ క్రీడలో పతకం సాధించని వరంగల్ కమిషనరేట్ ఈ క్రీడల్లో కాంస్య పతకాన్ని సాధించి క్రీడాకారుల్లో జోష్ ను నింపారు. ముఖ్యంగా ఈ క్రీడల్లో అత్యధికంగా పతకాలను సాధించడానికి వరంగల్ పోలీస్ కమిషనర్ క్రీడాకారులను అందించిన ప్రోత్సహమే ప్రధాన కారణంగా క్రీడాకారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ములుగు అభివృద్ధికి మరో ముందడుగు





**ములుగు మహా:** ములుగు జిల్లా దేవాదుల పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క వినతిపత్రం సమర్పించారు. గోదావరి నది రైట్ బ్యాంక్ పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేయాలని, అలాగే కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తూపాకులగూడెం, దేవాదుల పరిసర గ్రామాల్లోని చెరువులకు నీరందించేందుకు ఈ ప్రతిపాదిత పథకం కీలకంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేయకుండా నిలిచిపోయిన లక్ష్మీపురం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణతో పాటు, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద గోదావరి బ్యాక్ వాటర్‌ను వినియోగిస్తూ కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ పథకం ద్వారా మొత్తం 921 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రణాళికను సీఎం కు అందచేశారు. లక్ష్మీపురం ఎత్తిపోతల 2007లో నిర్మాణం పూర్తి అయినప్పటికీ, గోదావరి ప్రవాహ మార్పులు, ఇసుక పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ఆ పథకం నిరూపయోగంగా మారిందని...దాన్ని ఉపయోగంలోకి తెచ్చేలా మార్పులు చేయాలని మంత్రి సీతక్క సీఎంను విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలుతో చిన్న, అంచున రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి, భూగర్భ జలాల పునర్వ్యవస్థీకరణ, తాగునీటి లభ్యత పెంపు, రైతుల సామాజిక-ఆర్థిక స్థితి మెరుగుదల సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా తక్షణ పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని సీఎంను మంత్రి సీతక్క కోరారు. మంత్రి విజ్ఞప్తి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలో ఇరిగేషన్ శాఖలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు





**తొర్రూరు మహా:** తొర్రూరు పట్టణ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 24 వ వార్షిక బ్రహ్మోత్సవాలు వికాస తరంగిణి శాఖ, ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా ఆగమ శాస్త్రానుసారం వేదమంత్రోచ్చారణల నడుమ స్థానాచార్యులు ఓలేటి యాదగిరా చార్యులు, ఆలయ అర్చకులు ఆరుట్ల శ్రీకాంతాచార్యులు , ఓలేటి గీత చార్యులు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకలో వారు విష్వక్సేన ఆరాధన, ప్రవర పుణ్యాహవాచనం, పాద ప్రక్షాళన, మధుపర్కం యజ్ఞోపవిత ధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యసూత్ర ధారణ, తలంబ్రాలు, మాల సమర్పణ పూజా కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించారునిర్వహించారు. భక్తులు ప్రజలు సుభిక్షంగా శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని అర్చకులు కోరారు. ఆదివారం రోజున మహా పూర్ణాహుతి, బలిహరణం, నవ కలశ స్నపనం చక్రతీర్థం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, మహా పుష్పయాగం, ద్వాదశ ఆరాధనలు, ద్వాదశ ప్రదక్షిణలు, తీర్థ ప్రసాద వినియోగము పండిత ఆరాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ కుందూరు గీతా రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, డాక్టర్ కిరణ్ కుమార్, కొత్త యాదగిరి రెడ్డి, లయన్ వెంకట్ రెడ్డి, మల్యాల వెంకటేశ్వరరావు తమ్మి ఉపేందర్ ,మోహన్ రెడ్డి, నాళ్ళ కృష్ణమూర్తి, చలువాది సత్యనారాయణ తమ్మెర వీరభద్రరావు, ఇమ్మడి రాంబాబు బోనగిరి శంకర్, కోనే ప్రభాకర్ , చలువాది సత్యనారాయణ, కుందూరు గీతా రెడ్డి, ప్రసూన, అనుపమ విజయలక్ష్మి రేణుక, శోభ ,ఇందిర,ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధికి భవన కార్మిక సంఘం అండగా నిలవాలి



**తొర్రూరు మహా:** తొర్రూరు పట్టణ అభివృద్ధికి భవన నిర్మాణ కార్మిక యూనియన్ సంఘం కార్మికులు అండగా నిలవాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ కోరారు. ఆదివారం నూతనంగా ఎన్నికైన తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ ను భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి అధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల సహకారంతో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సోమ హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి మార్క అరుణ్ కుమార్, కోశాధికారి బైన నవీన్, ఉపాధ్యక్షులు మొగిలి మల్లేశం, గౌరవ సలహాదారులు సోమ మల్లేష్, వేముల మురళి,బండి రాజబాబు, బైస సోమ నర్సయ్య, పెద్ది మధు తదితరులు పాల్గొన్నారు.